## క్లుప్తంగా

### అభివృద్ధి పరుగులు

**అశ్వాపురం:** పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టనుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, మండల నాయకుడు ఓరుగంటి రమేష్‌బాబు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఆళ్లపల్లి, గుండాల, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి సీఆర్ఆర్ గ్రాంటు రూ.15 కోట్లు ఎమ్మెల్యే మంజూరు చేయించారన్నారు. అశ్వాపురం మండలంలో సంద్రలబోడు నుంచి అమెర్ద వరకు 3 కిలోమీటర్లు బీటీ రోడ్డుకు రూ.2కోట్లు, కుర్సంవారిగూడెం నుంచి జగ్గారం వరకు 2.8 కిలోమీటర్లు బీటీ రోడ్డుకు రూ.1.90కోట్లు మంజూరు చేయించినందుకు మండల ప్రజల పక్షాన ఎమ్మెల్యే పాయంకు ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు.

### ఎస్టీ జాబితాలో నమోదు చేయాలి

**చర్ల:** మూల ఆదివాసీలను ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న కుల గణనలో ఎస్టీ జాబితాలో నమోదు చేయాలని గోండి యువసేన మండల అధ్యక్షుడు మడకం చందు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగిన మూల ఆదివాసీల (గొత్తికోయ) సమావేశంలో ఆయన మట్లాడారు. అత్యున్నత గౌరవ న్యాయంస్థానం కూడా తమకు ఎస్టీ కుల ధ్రువ పత్రాలివ్వాలని ఆదేశించినప్పటికీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుండడం సరైంది కాదని మండిపడ్డారు. గోండి యువసేనా నాయకులు కోసయ్య, పొడియం కోసయ్య, పద్దం జోగయ్య, కట్టం గంగయ్య, కుడుం ఉంగయ్య, సోడి కోసయ్య, కిస్కి గంగయ్య, కొవ్వాసి భద్రయ్య పాల్గొన్నారు.

**బీసీ జాబితాలో..**

**చర్ల:** ఏజెన్సీ ప్రాంతంలోకి వలస వచ్చిన గౌడ కులస్తులను కుల గణనలో బీసీ–బీ జాబితాలోనే నమోదు చేయాలని ఎస్టీ జాబితాలో నమోదు చేయవద్దని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. 1950 జనవరి 26న భారత రాష్ట్రపతి షెడ్యూల్ట్ తెగలను గుర్తించి ఆమోదం తెలిపిన గెజిట్ ప్రకారమే ఏజెన్సీ ప్రాంతంలో కుల గణనను నిర్వహించాలని కోరారు. సమావేశంలో నాయకులు పూనెం నాగేశ్వరావు, కొమరం ప్రతాప్, కారం రాజేష్, కనితి మహేష్, రాజేష్ పాల్గొన్నారు.

### ఉచిత మెగా వైద్యశిబిరం

**అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ):** మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జంగాల కుటుంబీకుల ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణానికి చెందిన జీవనరేఖ తల్లిపిల్లల ఆస్పత్రి సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పిల్లల వైద్య నిపుణులు జంగాల గోపీకృష్ణ, స్త్రీల ప్రసూతి వైద్యనిపుణులు జంగాల స్రవంతి పిల్లలకు, మహిళలకు వైద్యపరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సందర్శించి ఉచిత సేవలు అందిస్తున్న వారిని అభినందించారు. వనమా గాంధీ, పర్సా వెంకట్, జంగాల శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.

### ఉపాధి కల్పించాలి

**అశ్వాపురం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోనీ ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఏఐవైఎఫ్ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్‌సాయి, మండల నాయకులు రెడ్డి బొయిన వెంకన్న, పర్శిక రాజు, లంకెల శ్రావణ్, శ్రీకాంత్, లక్ష్మణ్, అన్వేష్, వినయ్, రాహుల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### బీమా వర్తింపజేయాలి

**మణుగూరురూరల్:** సింగరేణిలో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు, కాంట్రాక్ట్, ఓబీ వర్కర్లకు అన్ని ప్రమాదాలకు సంబంధించి ప్రమాద బీమా పథకాన్ని వర్తింపజేయాలని ఇఫ్టూ ఏరియా నాయకుడు మంగీలాల్ యజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఏరియాలోని జీఎం కార్యాలయం వద్ద సెక్యూరిటీ గార్డ్ అడ్డాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన సెక్యూరిటిగార్డ్ పాడుపుగంటి రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రైవేట్ సెక్యూరిటి సూపర్‌వైజర్ రామ్ అవతార్, సెక్యూరిటీ గార్డులు ప్రభాకర్, వీరబాబు, సుధాకర్, వంశీ, రవి, రమేష్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### పేర్లు నమోదు చేసుకోండి

**దుమ్ముగూడెం:** ప్రత్యేక ఉపాధ్యాయులుగా పని చేసిన వారందరూ తమ పేర్లు నమోదు చేసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాస్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 398 వేతనంతో పనిచేసిన స్పెషల్ టీచర్లందరూ వెంటనే తమ పేరును జిల్లా స్పెషల్ టీచర్ లిస్టులో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక ఉద్యోగులుగా పనిచేసి ఉంటే వెంటనే సమాచారాన్ని బెక్కంటి శ్రీనివాసరావు 9848351370 లేదా 9396982375కు మెసేజ్ పెట్టాలని కోరారు.

# చి'వరి'తడి కరువాయే..

- ఇంకిపోయిన చెరువు.. పొట్టదశలో పొలాలు
- ప్రతిఏటా చీమలగూడెం రైతులకు ఇవే వెతలు



అడుగంటిన చీమలగూడెం ఊరచెరువు

**గుండాల:** సాగు నీరు అందడం లేదని అధికారుల చుట్టూ తిరుగుతున్నాం.. ప్రజా ప్రతినిధుల వెంట పడుతున్నాం.. అయినా ఫలితం లేకుండా పోతోంది.. ప్రతీ ఏటా వరి చేను పొట్టదశలో ఉన్నప్పుడు చివరి తడి అందకుండానే ఎండిపోవాల్సిన వస్తోంది.. ఇది మండల పరిధిలోని చీమలగూడెం రైతులు ఆవేదన.

గ్రామానికి చెందిన ఊర చెరువు వర్షాకాలం రాగేనే నిండుతుంది. ఈ చెరవు కింద సుమారు 500ల ఎకరాల వరకు వరి సాగవుతుంది. గత కొన్నేళ్లుగా వరి చేన్లు పొట్టదశకు వచ్చే క్రమంలోనే చెరువులో నీళ్లన్నీ ఇంకిపోతున్నాయి. దీంతో చివరి తడి కోసం ఆ రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అక్కడక్కడ ఉన్న గుంతల్లో నీళ్లను ఆయిల్ ఇంజన్లు, కరెంటు మోటార్ల సాయంతో పైపుల ద్వారా తూములకు మళ్లిస్తున్నారు. మరో పక్క మల్లన్న వాగు నుంచి మోటార్లతో నీళ్లందిస్తున్నారు. ఈ ప్రయత్నాలతో పంటకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. చెరువులో నీళ్లుంటేనే సరైన మోతాదులో నీరందుతుంది.

**చెరువుకేమైంది!?**

2010లో ఉపాధిహామి పథకంలో ఈ చెరువు కట్టపై పోత, అలుగు నిర్మాణ పనులు చేపట్టారు. గత ఐదేళ్ల క్రితం మిషన్ కాకతీయలో రూ.40 లక్షలతో పనులు చేపట్టారు. పనులు నాసిరకంగా జరిగాయని ఆనాటి నుంచి రైతులు చెప్తూనే వస్తున్నారు. అయినా అధికారులు వారి మాటలు పెడచెవిన పెట్టారు. ఆ పనితీరు ఫలితమో ఏమోగాని చెరువులో నీరు నిలువడం లేదు. ఫలితంగా ఆయకట్ట పొలాలను రైతులు బీడ్లుగా వదిలేశారు. ధైర్యం చేసి సాగు చేసిన రైతులకు కోత దశలు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.

**నష్టాల దిశగా సాగు..**

ప్రస్తుతం వరి పొట్టదశలో ఉంది. రైతులు ఒక్కో ఎకరానికి రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఈ నేపథ్యంలో పంటలకు నీరందకపోతే పూర్తిగా ఎండిపోతాయి. చేతికందిన పంట చేజారిపోతుంది. ఇలాంటి పరిస్థితిపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నప్పటికీ తమ గోడును పట్టించుకున్న పాపాన పోలేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చి పరిస్థితిని చూసి పోతున్నారే తప్పా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని చెబుతున్నారు.

**చెక్‌డ్యాంకు పైపులైన్ వేస్తేనే సాగునీరు..**

గ్రామానికి 2కిలోమీటర్ల దూరంలో పాండవుల తోగు ఉంది. గతంలో అక్కడ చిన్న చెక్‌డ్యాం నిర్మించి పైపుల ద్వారా మరో చెక్‌డ్యాంకు.. అక్కడి నుంచి చెరువుకు నీళ్లందించారు. కానీ ఆ పైపులు మొత్తం పగిలిపోయి నీరంతా వృథాగా పోతుంది. పాండవుల తోగు నుంచి నూతనంగా పైపులైన్ గానీ మళ్లింపు కాలువ నిర్మాణంగానీ చేపట్టినట్లయితే చెరువులోకి పుష్కలంగా నీరందుతుంది. ఏడాదికి రెండు పంటలు పండే అవకాశాలున్నాయని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

**ప్రతీ ఏటా విన్నవిస్తున్నాం..**



ప్రతీ సంవత్సరం అధికారులను అడుగుతూనే ఉన్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. వస్తున్నారు, ప్రణాళికలు వేస్తున్నాం అంటున్నారే తప్పా.. నిధులు తీసుకురావడం లేదు. దీంతో నీళ్లు లేక చేన్లన్ని ఎండిపోతున్నాయి.

– పాయం సారయ్య, స్థానిక రైతు

**రూ.లక్షలు పెట్టినా ఫలితం లేదు**



గతంలో మిషన్‌కాకతీయలో రూ.40 లక్షలతో పనులు చేపట్టినా ఫలితం లేదు. చెక్‌డ్యాం పనులు కూడా నాణ్యత లేదు. ఒక్క పంటకు కూడా నీళ్లందని పరిస్థితి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చొరవ తీసుకుంటేనే నిధులు వస్తాయి.

– కల్తి రాంబాబు, స్థానిక రైతు

# విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరురూరల్:** విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని హనుమాన్ టెంపుల్ వద్ద ఉన్న బ్రహ్మంగారి గుడి ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణుల కార్తీకమాస వనభోజన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. తొలుత బ్రహ్మంగారి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం కావడం సంతోషకరమన్నారు. విశ్వబ్రాహ్మణ కుటుంబంలోని నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో బ్రహ్మంగారి గుడి ప్రాంతం అభివృద్ధి చెందనుందని, ప్రధాన రహదారి జాతీయ రహదారికి మారనుందని తెలిపారు. మణుగూరు ప్రాంతంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ స్థాపనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, పీవీ చారి, ఏఎం చారి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, సంఘ పెద్దలు, విశ్వబ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పాఠశాలకు రేకుల షెడ్డు ఏర్పాటు

**ములకలపల్లి:** ములకలపల్లి మండలశివారులోని వలస గొత్తికోయ గుంపు బండారిగూడెం గ్రామంలో పాఠశాల కోసం చిరాగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రేకుల షెడ్డు నిర్మించారు. బండారిగూడెం, చీపురుగూడెం గ్రామాల్లో సుమారు 45 మంది విద్యార్థులుండగా.. పూరిపాకలో పాఠశాల నిర్వహిస్తున్నారు. గత ఏడాది చిన్నారులకు రగ్గుల పంపిణీకి గ్రామాన్ని సందర్శించిన ములకలపల్లి వాసి, ఖమ్మం ఎస్సై పుష్పాల రామారావు, చిరా ఫౌండేషన్ బాధ్యులు.. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. ఎస్సై రామారావు పర్యవేక్షణలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ నిమిత్తం రూ.లక్ష రూపాయల వెచ్చించి, రేకులతో పక్కా షెడ్డు వేశారు. ఆదివారం షెడ్డును ప్రారంభించి, చిన్నారులకు అందుబాటులోకి తెచ్చారు. ఎస్సై రామారావు, ఫౌండేషన్ సభ్యులు పురుషోత్తం, జర్నలిస్ట్ క్రాంతి, పుష్పాల సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన రేకుల షెడ్డు వద్ద ఎస్సై రామారావు, ఫౌండేషన్ బాధ్యులు, విద్యార్థులు

# సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

**మణుగూరురూరల్:** ప్రతీ ఒక్కరు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సామాజిక కార్యకర్త ఏ.మంగీలాల్ తెలిపారు. ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా పీవీకాలనీ ఎస్‌టీపీ ప్లాంట్ వాటర్‌ను టెస్టింగ్ ల్యాబ్ టెక్నీషియన్ డి.నరేష్ నీళ్ల శుభ్రత విధానం, అశుభ్ర నీటిని శుద్ధి చేసి వ్యవసాయానికి వాడే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా మంగీలాల్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో సైన్స్ ప్రభావం ఎక్కువగానే ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఏ.టాటాలాల్, కె.శ్రీకాంత్, ప్రహర్ష, ఎస్.యువన్, ఎస్.సంజయ్‌రామ్, ఎల్.శ్రీనిత్, డి.వర్షిత్, మానవిత్ తదితరులు పాల్గొన్నారు.

# వనంలో 'కార్తీక' అన్నసమారాధన



కార్తీక వనసమారాధనకు హాజరైన భక్తులు

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని వేదాంతపురం అటవీ ప్రాంతం సమీపంలోగల శ్రీవనదుర్గాంబిక సమేత వనలింగేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయం పదో వార్షికోత్సవం, కార్తీక మాసం సందర్భంగా భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించగా పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు. ఆలయ పరిసరాలను, స్వామి ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించగా, భక్తులు ముందుగా అమ్మవారు, స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే అమ్మవారికి వేద పండితుల సమక్షంలో వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేయగా, అయప్ప, భవానీ మాలధారులు తరలివచ్చారు. కార్యక్రమానికి అశ్వారావుపేట, దమ్మపేటతోపాటు ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి, కుక్కునూరు మండలాల నుంచి దాదాపు ఐదు వేల మంది భక్తులు హాజరైనట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. కాగా, ఆలయానికి వెళ్లే మార్గం అటవీ మార్గం కావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో ఆలయానికి చేరుకోడానికి గంటకుపైగా సమయం పట్టింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం వద్దకు భక్తులు తరలి రాగా, వనంలో సందడి నెలకొంది. అదే విధంగా మండలంలోని తిరుమలకుంట గ్రామంలో కార్తీక మాసం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అయప్ప, భవాని మాలధారులకు భిక్ష ఏర్పాటు చేయగా మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఓటు నమోదు శిబిరాల్లో 430 దరఖాస్తులు

**అశ్వారావుపేటరూరల్:** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలకు విశేష స్పందన వచ్చిందని స్థానిక తహసీల్దార్ కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని పోలింగ్ బూత్‌లలో ఏర్పాటు చేసిన ఓటు నమోదు శిబిరాల్లో మొత్తం 430 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. వీటిలో ఫాం–6కు 220, ఫాం–7కు 127, ఫాం–8కు 83 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

### కొనసాగుతున్న సర్వే

**కరకగూడెం:** మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఆదివారం సమగ్ర కుటుంబ సర్వే కొనసాగింది. ఈ మేరకు 35 మంది ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి 334 మంది కుటుంబాల వివరాలను నమోదు చేసుకున్నారు. కరకగూడెం ఎంపీడీఓ కుమార్ క్షేత్రస్థాయిలో సర్వే తీరును పరిశీలించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

### భూమిపూజ

**చర్ల:** మండలంలోని ఆర్ కొత్తగూడెం గ్రామ పంచాయతీలోని దానవాయిపేటలో నూతనంగా ఏర్పాటు చేయనున్న అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### అసత్య ప్రచారం చేస్తున్నారు..

**మణుగూరుటౌన్:** సింగరేణిలో ఏఐటీయూసీ యూనియన్‌కు కార్మికుల్లో ఉన్న ఆదరణను ఓర్వలేకనే సంఘం నాయకత్వంపై మణుగూరులో అసంబద్ధ ప్రచారం చేస్తున్నారని బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఐఎన్‌టీయూసీ యూనియన్ విజ్ఞప్తి మేరకు గుడికోడ్‌పై చందా వసూలు ప్రారంభించామని తెలిపారు. ఆ చందా కూడా అందరి కార్మికుల వద్ద వసూలు చేయలేదన్న విషయాన్ని ఏఐటీయూసీపై తప్పుడు ప్రచారం చేస్తున్న యూనియన్ గుర్తించాలని సూచించారు.

### నిత్యావసరాల పంపిణీ

**అశ్వాపురం:** అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్మికులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిత్యావసర వస్తువులను సీఐ అశోక్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఎస్సైలు తిరుపతిరావు, రవూఫ్, పోలీస్ సిబ్బంది, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

### బియ్యం వితరణ

**అశ్వాపురం:** మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన కొమరం రాము అనారోగ్యంతో మృతి చెందగా.. నిరుపేద కుటుంబం కావడంతో దశ దినకర్మలకు 50 కేజీల బియ్యాన్ని ఆదివారం ఇంటెలిజెన్స్ ఏఎస్సై కాసరబాద శ్రీనివాస్ అందజేశారు. ఇటీవల దహన సంస్కారాలకు శ్రీనివాస్ రూ.5వేలు అందజేశారు.

# చెట్టు నీడే బస్ షెల్టర్

**అశ్వాపురం:** భారజల కర్మాగారం, సీతారామ ప్రాజెక్ట్, సీతమ్మ సాగర్ బ్యారేజీ, మిషన్ భగీరథ పథకంతో అశ్వాపురం మండలానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉన్నా.. మండల కేంద్రంలో కనీసం బస్టాండ్ లేక ప్రయాణికులు, మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సెంటర్‌లో ఉన్న రెండు చెట్ల నీడే బస్‌షెల్టర్. చెట్ల కింద రెండు సిమెంట్ బల్లల మీద కూర్చొని.. అవి సరిపోక నిలబడి ప్రయాణికులు బస్సులు ఎక్కుతున్నారు. కూర్చోడానికి కూర్చీలు లేక ఎండకు నీడ లేక దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీనికితోడు సమయానికి బస్సులు రాక గంటల తరబడి నిలబడలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా బస్టాండ్ నిర్మించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



చెట్టుకింద కూర్చొని బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

# సర్వేలో కనిపించని 'సిరిగుండం'

**దుమ్ముగూడెం:** మండలంలోని నారాయణరావుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వలస ఆదివాసీ గ్రామం సిరిగుండంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర సర్వే చేపట్టడం లేదు. సిరిగుండం వలస ఆదివాసీ గ్రామం మ్యాపులో, రికార్డుల్లో లేదంటూ సర్వే నుంచి ఈ గ్రామాన్ని అధికారులు మినహాయించారు. ఇక్కడి ఆదివాసీలు గత 30 సంవత్సరాల నుంచి గ్రామం ఏర్పారుచుకుని స్థిర నివాసలు కట్టుకుని ఈ గ్రామంలోనే జీవిస్తున్నారు. తెలంగాణా ప్రభుత్వం తమకు ఆధార్ కార్డులు, వంద రోజుల పని గ్యారంటీ కార్డులు, రేషన్ కార్డులు, ఓటరు నమోదు కార్డులు కూడా ఇచ్చింది. కానీ సమగ్ర సర్వేలో గ్రామాన్ని మినహాయించడం ప్రశ్నార్థకం. ఈ నేపథ్యంలో తమ గ్రామంలో సర్వే చేయకపోవడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు విలేకరులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆదివారం ఆగ్రామాన్ని సందర్శించిన ఆదివాసీ నాయకులు సరియం కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సిరిగుండం గ్రామస్తులు పొరుగు దేశం నుంచి వలస వచ్చిన వారు కాదని, భారత దేశంలో పౌరులేనని ప్రభుత్వానికి చురకలు వేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సవలం పుల్లయ్య, మడకం రమేష్, రవ్వ భీమయ్య, మడకం నందా, మడకం ఉంగయ్య, మడివి దేవి, కోవాసి ఉంగమ్మ, వుయికా చుక్కమ్మ, మడివి కోసి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం మంజూరు చేసిన ఆధార్, ఉపాధి హామీ కార్డులు చూపుతున్న గ్రామస్తులు

# దళారులను నమ్మి మోసపోవద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ):** దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రైతులకు సూచించారు. మండలంలోని గుంపెన సహకారసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు.

కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు. అనంతరం ఎర్రగుంట, జానకీపురం, మర్రిగూడెం, అన్నపురెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే.. సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, సొసైటీ చైర్మెన్ బోయినపల్లి సుధాకర్‌రావు, వైస్ చైర్మెన్ నల్లమోతు వెంకటనారాయణ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పర్సా వెంకట్, వేముల రమణ, బసవయ్య, శివా, వజ్రాల లక్ష్మారెడ్డి, దుబ్బాకుల రాము, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# రాజకీయ జోక్యం వద్దు

**దుమ్ముగూడెం:** ఇందిరమ్మ గ్రామ కమిటీల్లో రాజకీయ జోక్యం నివారించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం ములకపాడు గ్రామంలోని యలమంచి సీతారామయ్య భవనంలో సీపీఎం మండల కమిటీ సమావేశం యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ గ్రామ కమిటీలో రాజకీయ జోక్యం నివారించాలని, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన పేదలందరికీ అందేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. రేషన్ కార్డులు లేని అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, ఎస్టీలకు ట్రైకార్ లోన్ కింద డబ్బులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, శ్రీనుబాబు, బొల్లి సూర్య చంద్రరావు, మర్మం సమ్మక్క, కొడాలి లోకేష్ బాబు, సోడి రాంబాబు, వాగే ఖాదర్ బాబు, సోయం వీర్రాజు, కొమరం చంటి, గుడ్ల సాయి రెడ్డి, కారం బజార్, యానబోయిన నరసయ్య, సరియం ప్రసాద్, కటోజ్ గోవర్ధన్, కాక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల ఐక్యత అవసరం

**మణుగూరుటౌన్:** ఆర్యవైశ్యులు ఐక్యతతో ముందుకు సాగుతూ రాజకీయ, విద్య, వైద్య తదితర రంగాల్లో ముందుండాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దోసపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని వెన్నెల జలపాతం వద్ద జరిగిన కార్తీక వన మహోత్సవం కార్యక్రమానికి ఆయన జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడు దారా రమేశ్, గౌరవ అధ్యక్షురాలు పెండ్యాల రోజాలక్ష్మిలతో కలిసి హాజరై మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందున్నారని, మణుగూరు వరద బాధితులకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో 300 మందికి నిత్యావసర కిట్లు పంపిణీ చేశామని గుర్తు చేశారు. వాసవీక్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రత్యేక గుర్తింపు పొందామని తెలిపారు. వైభవంగా జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో వందలాది ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్వాపురం, పినపాక, కరకగూడెం, మణుగూరు మండలాల అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చిత్తలూరి ఉమ, ఎలుగూరి నగేశ్‌కుమార్, పట్టణ ఆర్యవైశ్య ప్రతినిధులు కత్తిరాము, కోలేటి భవానీశంకర్, చిత్తలూరి రమేశ్, బండారు నర్సింహారావు, కడవెండి విశ్వనాథగుప్తా, స్వరాజ్యరావు, కోటగిరి సందీప్, రేపాక వెంకన్న, చిన్న మస్తాన్, గాదంశెట్టి సుబ్రహ్మణ్యం, వందనపు వాసు, చిట్టూరి శేషుబాబు, దింటకుర్తి బ్రహ్మయ్య, కేశ రాజేంద్ర ప్రసాద్, బొగ్గవరపు అంజలి, కొత్త ఇందుమతి, సుగ్గల బాను తదితరులు ఉన్నారు.

**దమ్మపేట:** మండల కేంద్రం, దమ్మపేట గ్రామ శివారులోని మల్లారం వ్యవసాయ క్షేత్రంలో ఆర్యవైశ్యుల కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వనసమారాధనకు వందల సంఖ్యలో ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ముందుగా వ్యవసాయ క్షేత్రంలోని చెట్లకు మహిళలు పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరూ ఒకే వేదికపై కలుసుకున్న శుభ తరుణంలో ఒకరితో మరొకరి సుఖసంతోషాలను పంచుకున్నారు. పిల్లలు, పెద్దలు అందరూ కలసి ఆటపాటలతో సంతోషంగా గడిపారు. వనసమారాధనలో భాగంగా ఆర్యవైశ్యులు సామూహికంగా విందు భోజనాలను ఆరగించారు. సాయంత్ర సమయంలో ఔత్సాహికులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని, ప్రేక్షలను అలరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన రాజకీయ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: మాట్లాడుతున్న ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు



దమ్మపేట: ఆర్యవైశ్యుల వనసమారాధనలో సహపంక్తి భోజనాలు..